కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

# ఆదిత్య హృదయమ్ - భావార్ధముతో.

https://madhirafamily.wordpress.com/




సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://kirontypeinstitute985233150.wordpress.com/



Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

# శ్రీ సూర్యాష్టకమ్

01. ఆదిదేవనమస్తుభ్యం ప్రసీద మమభాస్కర
దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోఽస్తుతే ॥

02. సప్తాశ్వరథమారూ(డం)ఢం ప్రచండం కశ్యపాత్మజం
శ్వేతపద్మధరం దేవం తంసూర్యం ప్రణమామ్యహమ్ ॥

03. లోహితం రథమారూఢం సర్వలోకపితామహం
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥

04. త్రైగుణ్యంచ మహాశూరం బ్రహ్మావిష్ణుమహేశ్వరం
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

05. బృంహితం తేజసాం పుంజం వాయు రాకాశ మేవచ
ప్రభుంచ(ప్రియంచ) సర్వలోకానాం తంసూర్యం ప్రణమామ్యహమ్॥

06. బంధూక పుష్పసంకాశం హారకుండల భూషితం
ఏకచక్రధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

07. తంసూర్యం లోకకర్తారం మహాతేజః ప్రదీపనం
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

08. తంసూర్యం జగతాం నాథం జ్ఞాన ప్రాకాశ్య మోక్షమం
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

09. సూర్యాష్టకం పఠేన్నిత్యం గ్రహపీడా ప్రణాశనం
అపుత్రో లభతే పుత్రం దరిద్రో ధనవాన్భవేత్

10. ఆమిషం మధుపానంచయః కరోతి రవేర్దినే
సప్తజన్మ భవే ద్రోగ(గి) జన్మ జన్మ దరిద్రతా
స్త్రీతైల మధుమాంసాని యే త్యజంతి రవే ర్దినే
న వ్యాధి శోకదారిద్రయం సూర్యలోకం ప్ర(చ)గచ్ఛతి.

- - -

శ్రీ వాల్మీకి మహర్షి విరచిత శ్రీమద్రామాయణాంతర్గత

# ఆదిత్య హృదయమ్

ఆదిత్య హృదయంలో మొత్తం 31 శ్లోకాలు వున్నాయి. మొదటి 2 శ్లోకాలు - అగస్త్యుడు, శ్రీరాముని వద్దకు వచ్చుట. 3 నుండి 5 శ్లోకాలు - ఆదిత్య హృదయ పారాయణ వైశిష్టత గురించి చెప్పబడింది. 6 నుండి 15 శ్లోకాలు - సూర్యుడంటే బయటకు వ్యక్తమవుతున్న లోపలి ఆత్మ స్వరూపమని, బాహ్య రూపము అంతః స్వరూపము ఒక్కటే అని చెప్పబడింది. 16 నుండి 20 శ్లోకాలు - మంత్రజపం. 21 నుండి 24 శ్లోకాలు - సూర్యుడి గురించి శ్లోక మంత్రాలు. 25 నుండి 31 శ్లోకాలు - పారాయణ వల్ల కలిగే ఫలం. పారాయణ చేయవలసిన విధానం. సూర్య భగవానుడు శ్రీరామునికి విజయం లభించేట్లు ఆశీర్వదించటం ఉంటాయి.

01. తతో యుద్ధ పరిశ్రాంతం సమరే చింతయా స్థితమ్।
రావణం చాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితమ్॥

యుద్ధము చేసి చేసి మిక్కిలి అలసియున్న శ్రీరాముడు సమర రంగమున చింతాక్రాంతుడై యుండెను. పిమ్మట రావణుడు యుద్ధసన్నద్ధుడై ఆ స్వామి యెదుట నిలిచి యుండెను.

02. దైవ తైశ్య సమాగమ్య ద్రష్టు మభ్యాగ తోరణమ్।
ఉపాగమ్యాబ్రవీద్రామం అగస్త్యో భగవాన్ ఋషిః॥

యుద్ధమును చూచుటకై దేవతలతో కూడి అచ్చటికి విచ్చేసిన పూజ్యుడైన అగస్త్య మహర్షి శ్రీరాముని సమీపించి, ఆ ప్రభువుతో ఇట్లు పలికెను.

01.02. - రామ రావణ యుద్ధమును చూచుటకు దేవతలతో కూడ వచ్చియున్న అగస్త్య మహాముని యుద్ధము చేయుట వలన అలసియున్నవాడును, రావణుడిని

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

ఎలా వధించాలి అను విచారముతో కూడినవాడును ఎదుట వున్న రావణుని చూచి యుద్ధమునకు సిద్ధపడినవాడును అయిన రాముడిని సమీపించి ఇట్లు పేర్కొన్నాడు.

03.రామ రామ మహాబాహో శృణు గుహ్యం సనాతనమ్।
యేన సర్వా నరీన్ వత్స సమరే విజయిష్యసి॥

ఓ రామా! మహాబాహో! నాయనా! సనాతనము, మిగుల గోప్యము ఐన ఈ స్తోత్రమును గూర్చి తెలిపెదను వినుము. దీనిని జపించినచో సమరమున నీవు శత్రువులపై విజయము సాధించగలవు.

04. ఆదిత్యహృదయం పుణ్యం సర్వశత్రువినాశనం।
జయావహం జపేన్నిత్యం అక్షయ్యం పరమం శివమ్॥

ఈ ఆదిత్యహృదయం అను స్తోత్రము పరమ పవిత్రమైనది. సమస్త శత్రువులను నశింపజేయునది. నిత్యము దీనిని జపించినచో సర్వత్ర జయము లభించుట తథ్యము. ఇది సత్ఫలములను అక్షయముగ ప్రసాదించునది.

05. సర్వమంగళ మాంగళ్యం సర్వపాప ప్రణాశనం।
చింతాశోక ప్రశమనం ఆయుర్వర్ధన ముత్తమమ్॥

ఇది పరమపావనమైనది. సకల శ్రేయస్సులను సమకూర్చి సమస్త పాపములను నశింపజేయును. ఆధివ్యాధులను తొలగించి ఆయుస్సును వృద్ధిపరచును. సర్వ జపములలో శ్రేష్ఠమైనది. కావున దీనిని జపించుట ఎంతేని ఆవశ్యకము.

03, 04, 05 – మహాభాహువులు కల ఓ రామా నీకొక సనాతనమైన రహస్యమును చెప్పుచున్నాను వినుము. ఈ రహస్యము వలన నీవు శత్రువులందరిని జయింపగలవు. – ఆదిత్య హృదయమను స్తోత్రము కలదు. అది పావనమైనది,

Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

సకల శత్రునాశకమైనది. జయమును కలిగించునది. అక్షయఫలములను ఇచ్చునది. సర్వమంగళ ప్రదమైనది. - సమస్త పాపములను పోగొట్టునది. దీర్ఘాయువును కలుగజేయునది. చింతాశోకములను నివారించునది. ఉత్తమోత్తమైనది. దానిని జపించవలయును.

06. రశ్మిమంతం సముద్యంతం దేవాసుర నమస్కృతం।
పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరమ్॥

అనంతమైన బంగారు కిరణములతో శోభిల్లుచు, జాతికి జాగృతి కూర్చును. దేవాసురులు ఈయనకు ప్రణమిల్లుదురు. మిక్కిలి తేజస్సుగలవాడు, సమస్త భువనములను నియంత్రించువాడు, లోకములకు వెలుగునిచ్చు ఆదిత్యుని పూజింపుము.

06. ప్రశస్తములైన కిరణములు కలవాడును, అర్ధోదయాదులు లేక పూర్తిగా ఉదయించువాడును సురాసురులచే నమస్కరింపబడువాడును, తన తేజముచే ఇతరముల తేజస్సును కప్పివేయువాడును, కాంతులను కలిగించువాడును, భువనేశ్వరుడు అగు ఆదిత్యుని పూజింపుము.

07. సర్వదేవాత్మకో హ్యేషః తేజస్వీ రశ్మిభావనః।
ఏష దేవాసురగణాన్ లోకాన్ పాతి గభస్తిభిః॥

ఇతడు సమస్త దేవతలకు ఆత్మయైనవాడు. తేజో రాశి. తన కిరణములచే లోకమునకు శక్తిని, స్ఫూర్తిని ప్రసాదించువాడు. దేవాసుర గణములతో గూడి సమస్త లోకములను తన కిరణములచే రక్షించు చుండువాడు.

07. ఈ ఆదిత్యుడు సమస్త దేవతలకును ఆత్మయైనవాడు, తేజస్సు గలవాడు, తనరశ్మిచే లోకములను ప్రకాశింపచేయువాడు, దేవాసురులను లోకములను తన కాంతి కిరణములతో కాపాడుచున్నాడు.

Kiron Type Institute

08. ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ శివః స్కందః ప్రజాపతిః।
మహేంద్రో ధనదః కాలో యమః సోమో హ్యపాం పతిః॥

బ్రహ్మ, విష్ణువు, శివుడు, కుమారస్వామి, ప్రజాపతి, దేవేంద్రుడు, కుబేరుడు, కాలస్వరూపుడు, యముడు, చంద్రుడు, వరుణుడు మరియు

08. బ్రహ్మ, విష్ణువు, శివుడు, స్కంధుడు, ప్రజాపతులు, దేవేంద్రుడు, కుబేరుడు, మృత్యు దేవత, యముడు, చంద్రుడు, వర్ణుడు ఈ ఆదిత్యుడే. ఇతని దేహమే సమస్త దేవతామయము.

09. పితరో వసవః సాధ్యాః హ్యశ్వినౌ మరుతో మనుః।
వాయుర్వహ్నిః ప్రజాప్రాణః ఋతుకర్తా ప్రభాకరః॥

ప్రితృదేవతలు, వసువులు, సాధ్యులు, అశ్వినీ దేవతలు, మరుత్తులు, మనువు, వాయువు, అగ్ని, ప్రజలు మొదలగువారి స్వరూపములు అన్నియు ఇతనివే. షడృతువులకు కారకుడు ఈ ప్రభాకరుడే.

09. పిత్రు దేవతలు, పశువులు, సాద్యులు, అశ్వనీ దేవతలు, మరుత్తులు, మనువు, వాయువు, అగ్ని, ఈ ఆదిత్యుడే. ప్రజలకు ప్రాణభూతమైనవాడు, వసంతాది ఋతువులకు కారణమైనవాడు కూడ ఈ ఆదిత్యుడే.

10. ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్।
సువర్ణ సదృశో భానుః స్వర్ణరేతా దివాకరః॥

ఆదిత్యుడు జగత్ సృష్టికి కారకుడు. జనులు తమ విధులు నిర్వర్తించుటకు ప్రేరణయిచ్చును. లోకోపకారం కొరకు ఆకాశమున సంచరించి వర్షములద్వారా జగత్తును పోషించి తన కిరణములతో లోకమును ప్రకాశింపజేయును. బంగారు వన్నెతో తేజరిల్లుచు అద్భుతముగ ప్రకాశించువాడు. బ్రహ్మాండములు ఉత్పత్తికి బీజమైనవాడు. చీకట్లను తొలగించుచు దివాసమయమున ప్రాణులను కార్య నిమగ్నులను గావించువాడు.

10. ఆదిత్యుడు లోక ప్రేరేపకుడు. జనులను కర్మలందు ప్రోత్సహించువాడు, ఆకాశ విహారి, వర్షము మూలమున జగత్తును పోషించువాడు, శ్రేష్ఠమైన కిరణములు కలవాడు, బంగారు వంటి తేజస్సు కలవాడు, పగటిని కలిగించువాడు, ప్రకాశించువాడు అన్నియు ఆ సూర్య భగవానుడే.

11. హరిదశ్వః సహస్రార్చిః సప్తసప్తి ర్మరీచిమాన్।
తిమిరోన్మథనః శంభుః త్వష్టా మార్తాండ అంశుమాన్॥

శ్యామవర్ణముగల రథాశ్వములు గలవాడు, అసంఖ్యాకములైన కిరణములు గలవాడు, సప్త అను పేరుగల రథముగలవాడు, రథమునకు ఏడు గుఱ్ఱములు గలవాడు, తేజో విధానములైన కిరణములు గలవాడు, చీకట్లను పారద్రోలువాడు, సుఖములను గూర్చువాడు, సర్వ సంహారకుడు, జగత్ప్రళయమునకు పిమ్మట దానిని మరల సృజించుటకై ఆవిర్భవించెడివాడు, నిరంతరము తన కిరణములచే ప్రకాశించుచుండువాడు.

11. ఓ సూర్యుడా నీవు ఆకుపచ్చ రంగు గుర్రములు కలవాడవు. వేయి కిరణములు వున్న వాడవు, ఏడు గుర్రములు కలవాడవు. ప్రశస్తిగల కిరణములు కలవాడవు. చీకటిని నశింపచేయువాడవు. సుఖమును ప్రసాదించువాడవు, నామరూపములను నిర్మూలింప చేయువాడవు, బ్రహ్మాండమును మరల జీవింప చేయువాడవు, ప్రపంచమంతటను వ్యాపించువాడవు.

12. హిరణ్యగర్భః శిశిరః తపనో భాస్కరో రవిః।
అగ్నిగర్భో దితేం పుత్రః శంఖః శిశిరనాశనః॥

బ్రహ్మాండములను తన ఉదరమునందు ధరించువాడు, తాపత్రయములతో బాధపడువారికి ఆశ్రయమై వాటిని తొలగించుటకు శాంతిని ప్రసాదించువాడు, తపింప జేయువాడు, దివ్యములైన వెలుగులను గూర్చువాడు, సకల లోకములకు స్తుతిపాత్రుడు, దివాసమయమున అగ్నిని గర్భమునందు ధరించువాడు, అదితి

దేవికి పుత్రుడుగా అవతరించినవాడు, సాయంకాలమున స్వయముగ శాంతించువాడు, మంచును తొలగించువాడు,

12. ఓ దేవా నీవు హితము, రమణీయము అగు బుద్ధి కలవాడవు, చల్లని వాడవు, తపింపచేయువాడవు, ప్రకాశమును కలిగించువాడవు, వేదములచే స్తుతింప బడువాడవు, గర్భమునందు అగ్ని కలవాడవు, అదితి పుత్రుడవు, ప్రళయకాలమున శాంతముగ వుండువాడవు, మంచును పోగొట్టువాడవు.

13. వ్యోమనాథస్తమోభేదీ ఋగ్యజుస్సామపారగః।
ఘనవృష్టి రపాం మిత్రో వింధ్యవీథీ ప్లవంగమః॥

ఆకాశమునకు అధిపతియైనవాడు, రాహువును ఛేదించు లక్షణము గలవాడు, పూర్వాహ్ణమున ఋగ్వేదరూపము, మధ్యాహ్న సమయమున యజుర్వేద రూపమును, సాయంసమయమున సామవేద రూపమునను అలరారు చుండెడివాడు, ఘనముగా వర్షములను కురిపించు చుండువాడు, అందువలననే జలములను వర్షింప జేయువాడు అని ఖ్యాతి వహించెను. వింధ్యగిరి మార్గమున అతివేగముగా సంచరించువాడు.

13. ఓ దేవా నీవు ఆకాశనాథుడవు, చీకటిని పోగొట్టువాడవు, ఉదయ, మధ్యాహ్న, సాయం సమయాలలో ఋగ్వేద, యజుర్వేద, సామవేద స్వరూపుడవు (రుగ్యచూసామవేద పారంగధరుడవు), అధికమైన వర్షమును కురిపించువాడవు, జలమునకు మిత్రుడవు, ఆకాశ మార్గమున శీఘ్ర గమనమున పయనించువాడవు,

14. అతపీ మండలీ మృత్యుః పింగళః సర్వతాపనః।
కవిర్విశ్వో మహాతేజాః రక్తః సర్వ భవోద్భవః॥

వేడిని కలిగియుండువాడు, వృత్తాకారమైన బింబము గలవాడు, విరోధులను రూపుమాపువాడు, ప్రభాత సమయమున పింగళ వర్ణము కలిగి యుండువాడు, మధ్యాహ్న సమయమున సర్వప్రాణులను తపింప జేయు చుండువాడు, వ్యాకరణాది

సమస్త శాస్త్రముల యందును పండితుడు, విశ్వమును నిర్వహించువాడు, గొప్ప తేజస్సు గలవాడు, సకల ప్రాణుల యందును అనురక్తి కలిగి యుందువాడు, సమస్త ప్రాణుల ఉత్పత్తికి కారణమైనవాడు,

14. ఓ దేవా నీవు ఎండను కలిగించువాడవు, గుండ్రని రూపము కలవాడవు, మృత్యు స్వరూపుడవు, ఉదయకాలమున గోరోచనపు వన్నె కలవాడవు, మధ్యాహ్న కాలమున సమస్తమును తపింపచేయువాడవు, కవివి, సర్వ నిర్వాహకుడవు, మహాతేజస్వివి, రక్త వర్ణుడవు, సర్వ కార్య కారణ భూతుడవు.

15. నక్షత్ర గ్రహతారాణామ్ అధిపో విశ్వభావనః।
తేజసామపి తేజస్వీ ద్వాదశాత్మన్ నమోఽస్తుతే॥

నక్షత్రములకు, గ్రహములకు, తారలకును అధిపతి యైనవాడు, విశ్వస్థితికి హేతువు, అగ్న్యాది తేజస్సులకు మించిన తేజస్సు గలవాడు, పన్నెండు రూపములతో విలసిల్లువాడు, ఈ నామములతో ప్రసిద్ధికెక్కిన సూర్య భగవానుడా నీకు నమస్కారం.

15. ఓ దేవా నీవు అశ్వని మొదలైన, నక్షత్రముల గ్రహముల, తారల నాయకుడవు, విశ్వ స్థితి కారకుడవు, తేజస్సులన్నింటికి తేజస్సునిచ్చువాడవు, ఇంద్రుడు, దాత, బృగువు, భూషుడు, మిత్రుడు, వర్ణుడు, అర్యముడు, అర్చిస్సు, వివశ్వంతుడు, త్వష్ట, సవిత, విష్ణువు అను పండ్రెండు మూర్తులు గల నికిదే నమస్కారము.

16. నమః పూర్వాయ గిరయే పశ్చిమే గిరయే నమః।
జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః॥

స్వామి! నీవు పూర్వగిరియందును, పశ్చిమగిరి యందును విలసిల్లు చుండువాడవు. గ్రహములకు నక్షత్రములకు, దివా రాత్రములకు అధిపతివి. ఉపాసకులకు జయము అనుగ్రహించునట్టి ఓ సూర్యభగవానుడా నీకు నమస్కారము.

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

16. ఓ దేవా తూర్పు, పడమర, కొండలపై తోచు నీకు నా నమస్కారములు. జ్యోతిర్గణములకు అధినేతవైన నీకు నా నమస్కారములు. దినాధిపతివైన నీకు నా నమస్కారములు.

17. జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమో నమః।
నమో నమః స్సహస్రాంశో ఆదిత్యాయ నమో నమః॥

జయములను, శుభములను చేకూర్చువాడవు, శ్యామ వర్ణము గల రథాశ్వములుగలవాడవు, వేల కొలది కిరణములు గలవాడవు, అదితి పుత్రుడవైన ఓ సూర్య భగవానుడా నీకు నమస్కారము.

17. అడ్డులేని పరాక్రమముగల ఓ దేవా, విజయమును, మంగళమును కలిగించు వాడా నీకు నా నమస్కారములు. పచ్చని గుర్రములు, సహస్ర కిరణములు గల అధితి పుత్రా నీకు నా నమస్కారములు.

18. నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః
నమః పద్మప్రబోధాయ మార్తాండాయ నమో నమః॥

నిన్ను ఉపాసించని వారికి నీవు భయంకరుడవు. ప్రాణులకు శక్తిని ప్రసాదించువాడవు. శీఘ్రముగ ప్రయాణించువాడవు, పద్మములను వికసింప చేయువాడవు, జగత్ప్రళయమునకు పిమ్మట మరల సృజించుటకై ఆవిర్భవించు నట్టి ఓ సూర్యభగవానుడా నీకు నమస్కారము.

18. భూగృడవును, వీరుడవును, వేగముగా పయనించు వాడవు అయిన నీకు నా నమస్కారము. పద్మములను వికసింపచేయు నీకు నా నమస్కారము. బ్రహ్మాండ పునః సృష్టి హేతువు అయిన నీకు నా నమస్కారము.

19. బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యాయాదిత్యవర్చసే।
భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః॥

Kiron Type Institute

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రతీకవు. దివ్య తేజస్సంపన్నుడవు, కాంతికి నిధియైన వాడవు, ప్రళయకాలమున లయ కారకుడవు. అందువలన రుద్ర స్వరూపుడవైన ఓ సూర్యభగవానుడా నీకు నమస్కారము.

19. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల నియామకుడవు, సూర్యుడు ఆదిత్యుడవు అగు నీకు నా నమస్కారము. ప్రకాశమానుడవు, సర్వ భక్షకుడవు, రౌద్రరూపుడవు, అయిన నీకు నా నమస్కారము.

20.తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే।
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః॥

తమస్సును రూపుమాపువాడవు, జడత్వమును శీతలత్వమును నశింప జేయువాడవు, నిన్ను ఆశ్రయించినవారి శత్రువులను సంహరించువాడవు, పరమాత్మ స్వరూపుడవు, కృతఘ్నులను నశింపజేయుచు, దివ్యతేజస్సు విరజిమ్ముచు, సమస్త జ్యోతులకు అధిపతివైన నీకు నమస్కారము.

20. చీకటిని, మంచును పోగొట్టువాడవును, ఉపాసకుల శత్రువులను వధించువాడవును, అమిత తేజస్సు గలవాడవును, దీప్తిమంతుడవు, జోతిర్గణపతివి అగు నీకు నా నమస్కారము.

21. తప్తచామీ కరాభాయా వహ్నయే విశ్వకర్మణే।
నమస్తమోఽభినిఘ్నాయ రుచయే లోకసాక్షిణే॥

బంగారమువంటి వన్నెగలవాడవు, ఆహుతులను గ్రహించువాడవు, సర్వజగత్కర్తవు, తమస్సులను పారద్రోలువాడవు, ప్రకాశ స్వరూపుడవు, జగత్తున జరిగెడి సర్వజనుల కర్మలకు సాక్షియైన వాడవు కనుక ఓ భాస్కరుడా నీకు నమస్కారము.

21. కరిగిన బంగారు వన్నెవాడవు, అగ్ని రూపుడవు, జగత్కారకుడవు, అంధకారమును పోగొట్టు వాడవు, ప్రకాశ స్వరూపుడవు, లోక సాక్షివి అగు నీకు నా నమస్కారము.

22. నాశయత్యేష వై భూతం త దేవ సృజతి ప్రభుః।
పాయత్యేష తపత్యేష వర్ష త్యేష గభస్తిభిః॥

రఘునందనా! ఈ ప్రభువే సమస్త ప్రాణులను లయమొనర్చును, పిదప సృష్టించి పాలించు చుండును.ఇతడు తన కిరణములచేత జగత్తును తపింప జేయును, వర్షములను ప్రసాదించు చుండును.

22. సర్వ నియామకుడు అయిన ఈతడు జగత్తులను లయింపజేసి మరల సృజించును. తన రశ్మి చేత తాపము కలిగించి ఎండింపజేసి వర్షమును కురిపించును.

23. ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః।
ఏషచైవాగ్ని హోత్రం చ ఫలం చైవాగ్ని హోత్రిణామ్॥

ఇతడు సకల ప్రణులలో అంతర్యామిగా నుండును. వారు నిద్రించుచున్నను తాను మేల్కొనియే యుండును. హవిస్సు యొక్క స్వరూపమూ ఇతడే. తత్ఫలస్వరూపమూ ఇతడే.

23. ప్రాణికోటి సుషుప్తి యందు వుండగా ఆతడు సర్వత్రా వ్యాపించి మేలుకొని వుండును. అగ్నిహోత్రము అగ్నిహోత్రార్చనాఫలము కూడా ఈయనే.

24. వేదాశ్చ క్రతవశ్చైవ క్రతూనాం, ఫలమేవ చ।
యానికృత్యాని లోకేషు సర్వ ఏష రవిః ప్రభుః॥

ఇతడు వేదవేద్యుడు, యజ్ఞఫలస్వరూపుడు, లోకములో జరిగెడి సమస్త కార్యములకు ఈ సూర్యభగవానుడే ప్రభువు.

24. వేదములకు, క్రతువులకు, క్రతు ఫలములకు, లోక కృత్యములన్నింటికి ప్రభువు ఈ ఆదిత్యుడే.

25. ఏనమాపత్సు కృచ్ఛ్రేషు కాంతారేషు భయేషు చ।
కీర్తయన్ పురుషః కశ్చిన్నావసీదతి రాఘవ॥

రఘురామా! ఆపదలయందును, కష్టముల యందును, దుర్గమ మార్గముల యందును, భయ స్థితుల యందును ఈ స్వామిని కీర్తించిన వారికి నాశము ఉండదు.

25. ఓ రామా ఆపత్కాలమున, కష్టములు వచ్చినపుడు, భీకరారణ్యములో చిక్కు కున్నప్పుడు, భయస్థితులలో మానవుడు, ఈ ఆదిత్య హృదయమును పఠించినచో ఆ ఆపదలనుండి బయట పడి సుఖించును.

26. పూజయస్వైనమేకాగ్రో దేవదేవం జగత్పతిమ్।
ఏతత్ త్రిగుణితం జప్త్వా యుద్ధేషు విజయిష్యసి॥

దేవదేవుడు, జగత్పతియైన ఈ సూర్య భగవానుని ఏకాగ్రతతో పూజింపుము. ఈ ఆదిత్య హృదయమును ముమ్మారు జపించినచో నీవు ఈ మహా సంగ్రామము నందు విజయము పొందగలవు.

26. ఓ రామా నీవు ఏకాగ్ర చిత్తుడవై దేవ దేవుడు జగత్పతియు అగు ఈయనను పూజింపుము. ఈ ఆదిత్య హృదయమును ముమ్మారు జపింపుము. యుద్ధములో నీకు విజయము తప్పక చేకూరును.

27. అస్మిన్ క్షణే మహాబాహో రావణం త్వం వధిష్యసి।
ఏవముక్త్వా తదాఽగస్త్యో జగామ చ యథాగతమ్॥

మహాబాహో! రామా! ఈ క్షణముననే నీవు రావణుని వధింపగలవు అని పలికి అగస్త్య మహర్షి తన స్థానమునకు చేరెను.

27. మహాభాహు నీవు ఈ రీతిగా చేసిన క్షణములో రావణుని వధింపగలవు, అని చెప్పి అగస్త్య మహాముని తాను వచ్చిన దారినే పోయెను.

28. ఏతచ్ఛ్రుత్వా మహాతేజా నష్టశోకో௨భవత్తదా।
ధారయామాస సుప్రీతో రాఘవః ప్రయతాత్మవాన్॥

మహాతేజస్వి యైన శ్రీరాముడు అగస్త్య మహాముని ద్వారా ఈ ఆదిత్య హృదయ మహిమను గ్రహించి చింతారహితుడయ్యెను. అతడు మిక్కిలి సంతృప్తి పొంది ఏకాగ్రతతో ఈ ఆదిత్య హృదయ మంత్రమును మనస్సు నందు నిలుపుకొనెను.

29. మహాతేజస్వి అయిన శ్రీరాముడు దీనిని విని మనస్సులోని చింతను విడచి, మిగుల సంతోషించి, ఏకాగ్రమైన మనస్సుతో ఈ స్తోత్ర ప్రతిపాదిత దైవమును ధ్యానించెను.

29. ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వా తు పరం హర్షమవాప్తవాన్।
త్రిరాచమ్య శుచిర్భూత్వా ధనురాదాయ వీర్యవాన్॥

పిదప ముమ్మారు ఆచమించి శుచియై సూర్య భగవానుని జూచుచు ఈ మంత్రమును జపించి పరమ సంతుష్టుడదయెను. పిమ్మట ఆ రఘువీరుడు తన ధనువును చేబూనెను.

29. మమహావీరుడగు శ్రీరాముడు ఆచమనము చేసి, శుచి అయి సూర్యుని చూచి మూడు సార్లు ఈ ఆదిత్య హృదయమును జపించి, అమిత సంతోషముతో వింటిని గ్రహించెను.

30. రావణం ప్రేక్ష్య హృష్టాత్మా యుద్ధాయ సముపాగమత్।
సర్వయత్నేన మహతా వధే తస్య ధృతో௨భవత్॥

మిక్కిలి సంతుష్టుడై యున్న ఆ రాముడు రావణుని జూచి యుద్ధమునకై పురోగమించెను. అన్ని విధములుగా గట్టి పూనికతో ఆ నిశాచరుని వధించుటకు కృతనిశ్చయుడయ్యెను.

30. రావణుని చూచి శ్రీరాముడు యుద్ధము చేయుటకు ఉత్సాహముతో వానిని సమీపించెను. ఆ రావణుని చంపుటకు దృఢ నిశ్చియుడు అయ్యెను.

31. అథరవిరవదన్ నిరీక్ష్య రామం
ముదితమనాః పరమం ప్రహృష్యమాణః।
నిశిచరపతి సంక్షయం విదిత్వా
సురగణమధ్యగతో వచస్త్వరేతి॥

పిమ్మట దేవతలమధ్యనున్న సూర్యభగవానుడు రావణుడు నశించుట తథ్యము అని ఎరింగి మానసోల్లాసమును పొందినవాడై, పరమ సంతోషముతో శ్రీరాముని జూచి రామా! త్వరపడుము అని పలికెను.

31. ఇట్లు శ్రీరాముడు దేవ దేవుని ధ్యానింపగా సూర్యుడు మిక్కిలి సంతశించెను. దేవతా సమూహమంతయును తన్ను పర్వేష్టించి వుండగా ఆయన శ్రీరామునికి విధితుడయి రాక్షస రాజునకు మృత్యువు ఆసన్నమైనదని ఓ రామా నీవు ఆలసింపకుము. పోరు సలుపుము అని హెచ్చరించెను.

--- ఓం శాంతి శాంతి శాంతి హీ ---

శ్లో॥ ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ
నారాయణః సరసిజాసన ఉ సన్నివిష్టః
కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ హారీ
హిరణ్మయవపుర్ ధృత శంఖచక్రః



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)